

సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరు పత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు

అర్హులందరికీ సీఎంఆర్ఎఫ్ : ఎమ్మెల్యే కృష్ణారావు

కూకట్‌పల్లి, మార్చి 28(ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రతి ఒక్కరికీ సీఎంఆర్ఎఫ్ నుంచి ఆర్థిక సాయం అందజేస్తామని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. కూకట్‌పల్లిలోని క్యాంపు కార్యాలయంలో ఆయన శుక్రవారం 28 మందికి సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరు పత్రాలను అందజేశారు. వైద్య ఖర్చుల నిమిత్తం వీరందరికీ కలిపి రూ.12,21,500 మంజూరైనట్టుఎమ్మెల్యే తెలిపారు.

కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే పేదలకు న్యాయం

● కాంగ్రెస్ పార్టీ కూకట్‌పల్లి ఇన్‌చార్జి బండి రమేష్

బాలానగర్, మార్చి 28(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే పేదలకు న్యాయం జరుగుతుందని కూకట్‌పల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జి బండి రమేష్ అన్నారు. మూసాపేటకు చెందిన గొలుసుల నర్సింగ్‌రావు, రఫియాబేగంలతో పాటు బాలానగర్‌కు చెందిన బాతుల చంద్రకళకు సీఎంఆర్ఎఫ్ నుంచి రూ.60 వేల చొప్పున ఆర్థిక సాయం మంజూరైంది. శుక్రవారం బాలానగర్‌లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో లబ్ధిదారులకు బండి రమేష్ ముఖ్యమంత్రి సహాయ నిధి మంజూరు పత్రాలను అందజేశారు. కాంగ్రెస్ నాయకులు లక్ష్మయ్య, కె. రమేష్, షకీల్, మధు తదితరులు పాల్గొన్నారు.



హైడ్రా కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కూకట్‌పల్లి కార్పొరేటర్

నల్లచెరువు సుందరీకరణ పనుల వివరాలివ్వండి

● హైడ్రా కమిషనర్‌కు కూకట్‌పల్లి కార్పొరేటర్ వినతి

కూకట్‌పల్లి, మార్చి 28(ఆంధ్రజ్యోతి): నల్లచెరువు సుందరీకరణ పనులకు సంబంధించిన సమగ్ర వివరాలను తనకు అందజేయాలని కూకట్‌పల్లి కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను కోరారు. ఈ మేరకు శుక్రవారం హైడ్రా కార్యాలయంలో కమిషనర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ సత్యనారాయణ మాట్లాడుతూ, కూకట్‌పల్లి డివిజన్ పరిధిలో ఉన్న నల్లచెరువు సుందరీకరణ పనుల్లో భాగంగా చెరువులోని నీటిని పూర్తిగా ఖాళీ చేయడంతో చుట్టుపక్కల ఉన్న కాలనీల్లో భూగర్భజలాలు అడుగంటిపోయాయని అన్నారు. నల్లచెరువు సుందరీకరణలో ఏఏ పనులు చేపడుతున్నారు, బతుకమ్మ కుంట నిర్మాణం చేపడతారా?, సుందరీకరణ పనులు ఎన్ని రోజుల్లో పూర్తి చేస్తారు వంటి వివరాలు తెలియజేయాలని వినతి పత్రంలో కోరామన్నారు. సానుకూలంగా స్పందించిన హైడ్రా కమిషనర్.. నల్లచెరువు సుందరీకరణ పనుల పూర్తి వివరాలు తెలియజేస్తామన్నారని తెలిపారు.

కూకట్‌పల్లి బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా పెద్ది గోవర్ధన్‌రెడ్డి



కేపీహెచ్‌బీకాలనీ, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : కూకట్‌పల్లి కోర్టు బార్ అసోసియేషన్ ఎన్నికల్లో అధ్యక్షుడిగా పెద్ది గోవర్ధన్‌రెడ్డి మూడోసారి భారీ మెజార్టీతో విజయం సాధించారు. గురువారం జరిగిన ఎన్నికల్లో సమీప అభ్యర్థి శ్రీనివాసరెడ్డి గట్టి పోటీ ఇస్తారని అనుకున్నా న్యాయవాదులు మాత్రం హ్యాట్రిక్ విజయాన్ని గోవర్ధన్‌రెడ్డికి అందించారు. ప్రధాన కార్యదర్శి ఎ.సుదర్శన్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా కె.భీమయ్య, సంయుక్త కార్యదర్శి హర్షవర్ధన్‌రెడ్డి, కోశాధికారి సైపుల్ల షరీఫ్, మహిళా కార్యదర్శి ఎం.లావణ్య, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ కార్యదర్శి సురేష్, కార్యవర్గ సభ్యులుగా జె.అఖిలా రావు, సీహెచ్ అర్చన గౌడ్, కల్యాణి తస్నీరు శ్రీకాంత్, పద్మావతి, రామకృష్ణ, భానుప్రసాద్ ఎన్నికైనట్లు ఎన్నికల అధికారిగా వ్యవహరించిన సీనియర్ న్యాయవాది సుభాష్ గుప్తా తెలిపారు. తనను మూడోసారి అధ్యక్షుడిగా ఎన్నుకున్న తోటి న్యాయవాదుల నమ్మకాన్ని నిజం చేస్తూ వారి ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేస్తానని గోవర్ధన్‌రెడ్డి అన్నారు కాగా, నూతనంగా ఎన్నికైన కార్యవర్గం ఏప్రిల్ మొదటి వారంలో బాధ్యతలు స్వీకరిస్తారు. ఏడాది పాటు వీరు పదవిలో ఉంటారు. ఎన్నికల్లో విజయం సాధించిన వారిని తోటి న్యాయవాదులు పూలమాలతో సత్కరించారు.



ఎన్నికల్లో విజయం సాధించిన వారిని పూలమాలలతో సత్కరించిన తోటి న్యాయవాదులు

నేడు ఆస్తిపన్ను పరిష్కార వేదికలు

కేపీహెచ్‌బీకాలనీ, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : జీహెచ్ఎంసీ కూకట్‌పల్లి, మూసాపేట సర్కిళ్ల కార్యాలయాల్లో శనివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఆస్తి పన్ను పరిష్కార వేదికలు నిర్వహిస్తారు. గృహ, వ్యాపార, వాణిజ్య సంస్థలకు సంబంధించిన ప్రాపర్టీ ట్యాక్స్ విషయంలో ఎలాంటి సందేహాలు ఉన్నా ఈ కార్యక్రమంలో నివృత్తి చేస్తారు. జంట సర్కిళ్ల పరిధిలోని ప్రాపర్టీ ట్యాక్స్ చెల్లింపుదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ కమిషనర్లు బండి గంగాధర్, భారతి వంశీకృష్ణ పన్ను చెల్లింపుదారులను కోరారు.

రేపటి నుంచి జ్ఞానయజ్ఞ మహోత్సవం

అల్లాపూర్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మూసాపేట డివిజన్ మోతీనగర్‌లోని శృంగేరీ శారదా శంకర మఠంలో ఈనెల 30 (ఆదివారం) నుంచి ఏప్రిల్ 7వ తేదీ వరకు శ్రీమద్ రామాయణ నవాహ్నిక జ్ఞానయజ్ఞ మహోత్సవం జరుగుతుందని మఠం ప్రతినిధి సీఎస్ఆర్ మూర్తి తెలిపారు. ఉగాది పర్వదినం నుంచి తొమ్మిది రోజుల పాటు విశేష పూజలు, శ్రీమద్ రామాయణ శ్లోక పారాయణాలు, ప్రవచనాలు ఉంటాయన్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో మూడేసి గంటల చొప్పున బ్రహ్మశ్రీ డా. కడిమెళ్ల వరప్రసాద్ పర్యవేక్షణలో ప్రవచనాలు ఉంటాయన్నారు. శ్రీరామ నవమి రోజున సీతారాముల కల్యాణం, మరునాడు శ్రీరామ పట్టాభిషేకం కార్యక్రమాలు ఘనంగా నిర్వహిస్తామన్నారు.



రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ సతీష్‌గౌడ్

అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాల్సిందే

● కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్

ఫతేనగర్, మార్చి 28(ఆంధ్రజ్యోతి): అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించకుంటే ఊరుకునేది లేదని కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్ హెచ్చరించారు. గురువారం రాత్రి ఫతేనగర్ డివిజన్ పరిధిలోని లాల్‌బహదూర్ శాస్త్రీనగర్‌లో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణం పనులను డివిజన్ ఏఈ రాధాకృష్ణతో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో డివిజన్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

గుప్పుమంటున్న గంజాయి

● కూకట్‌పల్లిలో యథేచ్ఛగా గంజాయి వ్యాపారం

● పోలీసులు చర్యలు తీసుకుంటున్నా ఆగని దందా

హైదర్‌నగర్,మార్చి28(ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి పరిసర ప్రాంతాల్లో గంజాయి గుప్పుమంటోంది. ఇక్కడ గంజాయి వ్యాపారం యథేచ్ఛగా సాగుతోంది. ఆంధ్రప్రదేశ్‌తో పాటు తెలంగాణాలోని పలు జిల్లాల నుంచి ఈ ప్రాంతానికి గుట్టుచప్పుడు కాకుండా గంజాయిని తీసుకొచ్చి విక్రయిస్తున్నారు.

●విద్యార్థులే లక్ష్యం

కూకట్‌పల్లి ప్రాంతంలో నివాసం ఉండే విద్యార్థులను లక్ష్యంగా చేసుకుని అక్రమ వ్యాపారానికి తెరలేపుతున్నారు. వ్యాపారులు హాస్టళ్లలో ఉంటూ తమ దందాను కొనసాగిస్తున్నారు. ఇంజినీరింగ్ కళాశాలలు, హాస్టళ్లు అధికంగా ఉండటంతో ఈ ప్రాంతాన్ని ఎంచుకుని వ్యాపారం చేస్తున్నట్టు సమాచారం. పాన్ షాపులు, బస్టాండ్‌లు, హాస్టళ్లలో 'సరుకు'ను నిల్వ చేసి విద్యార్థులు, యువతకు విక్రయిస్తూ వారిని మత్తుకు బానిసలుగా మారుస్తున్నారు.

అధికారులు దాడులు చేస్తున్నా..

రాష్ట్రాన్ని డ్రగ్స్, గంజాయి రహితంగా మార్చేందుక పోసులు, ఎక్సైజ్ అధికారులు ఎక్కడిక్కడ దాడులు చేస్తూ గంజాయి విక్రేతలపై ఉక్కుపాదం మోపుతున్నా ఫలితం ఇవ్వడం లేదు. ఎక్కడో ఓ చోట గంజాయి వ్యాపారులు చాపకింద నీరులా తమ దందాను కొనసాగిస్తున్నారు. కూకట్‌పల్లి కేపీహెచ్‌బీ, బాచుపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇటీవల సమారు 20 మంది వరకు గంజాయి తరలిస్తూ, విక్రయిస్తూ పోలీసులకు పట్టుపడగా. వారి నుంచి వందల కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నం, అల్లూరి ఏజెన్సీ, తెలంగాణాలోని ఖమ్మం తదితర ప్రాంతాల నుంచి గంజాయి తీసుకువచ్చి కూకట్‌పల్లి పరిసరాల్లో విక్రయిస్తున్నట్లు తెలుస్తుంది.

ఇటీవల నమోదైన కేసులు

●మార్చి 25న కేపీహెచ్‌బీ కాలనీ వన్‌సిటీ వద్ద గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి వారి నుంచి రూ.1.3కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నారు.

● మార్చి 3న నిజాంపేట రోడ్డులో గంజాయి తాగుతున్న ఏడుగురిని పోలీసులు అరెస్టు చేసి వారి నుంచి 20 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.



కేపీహెచ్‌బీలోని వన్ సిటీ అపార్ట్‌మెంట్ వద్ద గంజాయి విక్రయిస్తున్న ఇద్దరిని అరెస్టు చేసిన ఎక్సైజ్ పోలీసులు (ఫైల్)

● మార్చి 14న అమెరికాలో లభించే కుష్ గంజాయిని విక్రయించేందుకు యత్నిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి వారి నుంచి 1100 గ్రాముల కుష్ గంజాయి స్వాధీనం చేసుకున్నారు.

● మార్చి 14న కైత్లాపూర్‌లో గంజాయి విక్రయిస్తున్న ఇద్దరిని అరెస్టు చేసి వారి నుంచి 1.150 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నారు.

ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశాం



గంజాయి విక్రయాలను అరికట్టేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశాం. కూకట్‌పల్లి డివిజన్ పరిధిలోని కూకట్‌పల్లి, కేపీహెచ్‌బీ, బాచుపల్లి ఠాణాలను కలుపుకుని ఎస్ఓటీ బృందాలు పని చేస్తున్నాయి. ఇటీవల వ్యాపారులను అదుపులోకి తీసుకుని గంజాయిని స్వాధీనం చేసుకున్నాం. వారిపై కేసులు పెడుతున్నాం. ఎక్కువసార్లు గంజాయిని విక్రయిస్తూ పట్టుబడిన వారిపై పీడీయాక్ట్ నమోదు చేస్తాం. విద్యార్థులు, యువత గంజాయి వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి.

\- కె.శ్రీనివాస్, కూకట్‌పల్లి ఏసీపీ

బాలానగర్‌లో సందడిగా 'దావత్ ఏ ఇఫ్తార్'



విందులో పాల్గొన్న కార్పొరేటర్లు, ముస్లింలు

బాలానగర్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా బాలానగర్ కార్పొరేటర్ అవుల రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో తన నివాసంలో ఏర్పాటు చేసిన 'దావత్ ఏ ఇఫ్తార్'లో నియోజకవర్గంలోని కార్పొరేటర్లు, మసీదు పెద్దలు, ముస్లింలు పాల్గొన్నారు. విందుకు హాజరైన ముస్లింలు, మజీద్ పెద్దలకు కార్పొరేటర్లు పండ్లు తినిపించి ఉపవాదీక్షను విరమింపజేశారు. ఈ విందులో కార్పొరేటర్లు ముద్దం నర్సింహయాదవ్, పండాల సతీష్‌గౌడ్, మందడి శ్రీనివాస్, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మైనారిటీ అధ్యక్షుడు గౌసొద్దీన్, నాయకులు సయ్యద్ ఎజాజ్, కర్రె జంగయ్య, ఇర్ఫాన్, ఓమర్, సోఫీ పాల్గొన్నారు.

నేడు 'డయల్ యువర్ ఆర్టీసీ డీఎం'

ఫతేనగర్, మార్చి 28(ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి ఆర్టీసీ డిపో పరిధిలో తిరిగే ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే వారికి ఏమైనా సమస్యలు ఉంటే నేరుగా డిపో డీఎంకు తెలియజేసేందుకు శనివారం 'డయల్ యువర్ ఆర్టీసీ డీఎం' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ డి.హరి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మధాహ్నం 3 నుంచి 4 గంటల వరకు తాను ఫోన్‌లో అందుబాటులో ఉంటానని, ప్రయాణికులు నం.9959226151కు ఫోన్ చేసి తమ సమస్యలు, సలహాలను తెలియజేయాలని డీఎం కోరారు.

నీటిని పొదుపుగా వాడుకుందాం

● జలమండలి మేనేజర్ శ్రీకాంత్‌రెడ్డి

కేపీహెచ్‌బీకాలనీ, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : నీటిని పొదుపుగా వాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని జలమండలి కేపీహెచ్‌బీ సెక్షన్ మేనేజర్ శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. వరల్డ్ వాటర్ డే సందర్భంగా శుక్రవారం వసంతనగర్ కమాన్ నుంచి బస్టాపు వరకు ర్యాలీ నిర్వహించారు. జలమండలి ఉద్యోగులు, సిబ్బంది, కాలనీవాసులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. తాగునీటితో ఇళ్లు, రోడ్లు శుభ్రం చేయడం, వాహనాలను కడగటం వంటి చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. నీరు ఎంతో విలువైంది. భూగర్భ జలాలు అడుగంటిపోకుండా చూసుకోవాల్సిన ఆధ్య మనందరిపై ఉందన్నారు. అనంతరం సొసైటీ కార్యాలయ ప్రాంగణంలోని ఇంకుడు గుంత పునరుద్ధరణ కార్యక్రమం చేపట్టారు. అవకాశం ఉన్న చోట ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకునేలా సొసైటీ సభ్యులు నివాసితులకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఐడీపీఎల్ సొసైటీ అధ్యక్షులు యర్రా నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



వసంతనగర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న జలమండలి ఉద్యోగులు, కాలనీవాసులు



కూకట్‌పల్లి ఆర్టీసీ డిపోలో ఉద్యోగ విరమణ పొందుతున్న ఉద్యోగులను సన్మానించిన డిపో డీఎం హరి

ఉద్యోగ విరమణ సన్మానం

ఫతేనగర్, మార్చి 28(ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి ఆర్టీసీ డిపోలో పని చేస్తున్న పలువురు ఉద్యోగులు శుక్రవారం ఉద్యోగ విరమణ పొందారు. రిటైర్ అవుతున్న టి. చెన్నప్ప(సీఐ/జనరల్), కే. కృష్ణ(ఏడీసీ), బి. కృష్ణ(డ్రైవర్)లను డీఎం డి. హరి, డిపో అధికారులు, తెలంగాణ మజ్దూర్ యూనియన్ నాయకులతో కలిసి శాలువాతో సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. ఈ సందర్భంగా డీఎం మాట్లాడుతూ, ఉద్యోగ విరమణ పొందుతున్న వారి సేవలను ఆదర్శంగా తీసుకొని విధులు నిర్వహించాలని ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికులకు సూచించారు.

రాంగ్ రూట్లో వెళ్లొద్దన్నందుకు.. ట్రాఫిక్ కానిస్టేబుల్‌పై యువకుడి దాడి

బాలానగర్, మార్చి 28(ఆంధ్రజ్యోతి): రాంగ్ రూట్లో వెళ్లొద్దు, యాక్సిడెంట్ అవుతుందని చెప్పినా వినకుండా స్కూటర్‌పై ర్యాంగ్ రూట్లో వెళ్తుండగా అడ్డుకున్నందుకు ట్రాఫిక్ కానిస్టేబుల్ పైనే దాడికి పాల్పడ్డాడు ఓ యువకుడు. బాలానగర్ పోలీస్ స్టేషన్ పరిధి ఐడీపీఎల్ చౌరస్తా వద్ద శుక్రవారం రాత్రి ఈ ఘటన జరిగింది. బాలానగర్ సీఐ నర్సింహరాజు తెలిపిన వివరాల ప్రకారం.. పయాజొద్దీన్ (20) జగద్గిరిగుట్ట నుంచి వస్తూ బాలానగర్ వెళ్లేందుకు ర్యాంగ్ రూట్లో వెళ్తున్నాడు. రాంగ్ రూట్లో వెళ్లొద్దని, వెనక్కి వెళ్లమని అక్కడే విధులు నిర్వహిస్తున్న జీడిమెట్ల ట్రాఫిక్ కానిస్టేబుల్ ఆ యువకుడిని అడ్డుకున్నాడు. యువకుడు వినకుండా రాంగ్ రూట్లో వెళ్తుండటంతో ట్రాఫిక్ కానిస్టేబుల్ స్కూటర్ ముందుకు వెళ్లి ఫొటోలు తీయబోయాడు. ఫొటోలు ఎందుకు తీస్తున్నావని ఆ యువకుడు ట్రాఫిక్ కానిస్టేబుల్ పై దాడికి పాల్పడ్డాడు. కానిస్టేబుల్ ఫిర్యాదుతో బాలానగర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైతుబజార్‌లో కూరగాయల ధరలు

కేపీహెచ్‌బీకాలనీ, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి రైతుబజార్‌లో కూరగాయల ధరలు (కిలో. రూపాయల్లో) ఇలా ఉన్నాయి. టమోటా 11, వంకాయ 18, బెండ 35, పచ్చిమిర్చి 35, బజ్జీ మిర్చి 28, కాకర 35, బీర 35, క్యాబేజీ 10, బీన్స్ 45, క్యారెట్ 18, గోబీ పువ్వు 18, దొండ 28, చిక్కుడు 55, గోరు చిక్కుడు 35, బీట్‌రూట్ 15, క్యాప్సికం 35, ఆలు 21, పైన పేర్కొన్న ధరలు శనివారం ఉదయం 9.30 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

హెల్మెట్ ధరించండి.. ప్రాణాన్ని కాపాడుకోండి

● బాలానగర్ ట్రాఫిక్ సీఐ సురేశ్‌కుమార్

బాలానగర్, మార్చి 28(ఆంధ్రజ్యోతి): వాహనాలు నడిపేటప్పుడు తప్పని సరిగా హెల్మెట్ ధరించాలని బాలానగర్ ట్రాఫిక్ సీఐ సురేశ్‌కుమార్ వాహనదారులకు సూచించారు. బాలానగర్ ట్రాఫిక్ పోలీసులు, జూడియో సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం ఐడీపీఎల్‌లో ట్రాఫిక్ రూల్స్, ప్రమాదాల నివారణపై వాహనదారులకు అవగాహన కల్పించారు. హెల్మెట్ ధరించి వాహనం నడిపితే రోడ్డు ప్రమాదంలో కింద పడినప్పుడు తలకు ఎలాంటి గాయం కాదని, అందుకే నాణ్యమైన హెల్మెట్లను వాడాలని వారు వాహన దారులకు సూచించారు. హెల్మెట్ లేకుండా వాహనాలపై వెళ్తున్న వారికి జూడియో ఉద్యోగులతో కలిసి ఉచితంగా హెల్మెట్లు అందజేశారు. ట్రాఫిక్ సీఐ సురేష్‌కుమార్ నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్సై భాను ప్రసాద్, ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.



వాహనదారులకు ఉచితంగా హెల్మెట్లు అందజేస్తున్న ట్రాఫిక్ పోలీసులు

లౌడ్ స్పీకర్ల వినియోగానికి లైసెన్స్ తీసుకోండి

● సైబరాబాద్ కమిషనర్

హైదరాబాద్ సిటీ, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో లౌడ్ స్పీకర్లను వినియోగించాలన్నా, విక్రయించాలన్నా ముందుగా లైసెన్సు తీసుకోవాలని సైబరాబాద్ కమిషనర్ ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్ సిటీ లౌడ్ స్పీకర్స్ రూల్స్ 1963 ప్రకారం ఔత్సాహికులు దరఖాస్తులు చేసుకుంటే వాటిని పరిశీలించి లైసెన్సులను జారీ చేస్తామన్నారు. దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభమైందని, ఆసక్తి గల వారు మరిన్ని వివరాల కోసం www.cyberabadpolice.gov.in or www.cyberabadpolice.gov.in. ను సంప్రదించాలనిసూచించారు. దరఖాస్తుల స్వీకరణ, పరిశీలన అంతా ఆన్‌లైన్‌లోనే జరుగుతుందన్నారు.



మద్రాసి మిలిటరీ మెస్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న బండి రమేష్ తదితరులు

కేపీహెచ్‌బీలో మద్రాసి మిలిటరీ మెస్ ప్రారంభం

కేపీహెచ్‌బీకాలనీ, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): భోజన ప్రియులను దృష్టిలో పెట్టుకొని వారికి ఇష్టమైన ఆహార పదార్థాలు, వంటకాలను అందించగలిగితే హోటల్ వ్యాపారం బాగుంటుందని కాంగ్రెస్ పార్టీ కూకట్‌పల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేష్ అన్నారు. శుక్రవారం కేపీహెచ్‌బీ 3వ ఫేజ్ ఎంఐజీ బస్టాపు వద్ద భాస్కర్‌రావు ఏర్పాటు చేసిన మద్రాసి మిలిటరీ మెస్‌ను ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ, అన్ని వర్గాల వారిని ఆకర్షించేలా మెస్‌తో పాటు మిల్లెట్ కిచెన్, మండి ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఆహారం తయారీలో రుచితో పాటు పరిశుభ్రతకు పెద్ద పీట వేయాలని హోటల్ నిర్వాహకుడికి ఆయన సూచించారు.

అన్నదమ్ముల మధ్య గొడవ..తమ్ముడి అదృశ్యం



వంశీకృష్ణ

హైదర్‌నగర్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ఇంటి లోన్ తిరిగి చెల్లించే విషయంలో అన్నదమ్ముల మధ్య గొడవ జరగడంతో ఓ యువకుడు అదృశ్యమైన ఘటన కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. బాటసింగారం గ్రామానికి చెందిన ఏర్పుల వంశీకృష్ణ(33), భార్య షాలినితో కలిసి కూకట్‌పల్లి అడ్డగుట్టలోని ఓ హాస్టల్‌లో ఉంటూ ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడు. వంశీకృష్ణ అన్న రాధాకృష్ణ బ్యాంక్‌లోన్ తీసుకుని తమ స్వగ్రామం బాటసింగారంలో ఇంటిని నిర్మిస్తున్నాడు. బ్యాంక్‌కు ప్రతినెలా చెల్లించాల్సిన ఈఎంఐను వంశీకృష్ణను చెల్లించాలని కోరగా.. ఇద్దరి మధ్య గొడవ జరిగింది. రాధాకృష్ణ రోజూ వంశీకృష్ణకు ఫోన్ చేసి ఈఎంఐ చెల్లించాలని ఒత్తిడి చేస్తున్నాడు. గురువారం హాస్టల్ నుంచి ఆఫీస్‌కు వెళ్లిన వంశీకృష్ణ సాయంత్రం భార్యకు ఫోన్ చేసి తన అన్నా వదిన ఇంటి ఈఎంఐ డబ్బులు కట్టకపోతే ఆత్మహత్య చేసుకుంటామని బెదిరిస్తున్నారని, వాళ్లు పెట్టే బాధ భరించలేక ఎటైనా వెళ్లి చనిపోతా అని మెసేజ్ పెట్టి ఫోన్ స్విచ్ఛాఫ్ చేశాడు. భార్య షాలిని వంశీకృష్ణ ఆఫీస్‌తో పాటు స్నేహితులను విచారించినా ఆచూకీ తెలియకపోవడంతో కేపీహెచ్‌బీ పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

● మరో యువకుడి మిస్సింగ్



ఉదయ్‌భాస్కర్

కేపీహెచ్‌బీ కాలనీలో నివాసం ఉండే ఓ యువకుడు 15 రోజుల క్రితం అదృశ్యమయ్యాడు. బాపట్ల జిల్లా గొల్లపూడికి చెందిన గండ ఉదయ్‌భాస్కర్(30) కేపీహెచ్‌బీ కాలనీలోని మలేసియా టౌన్‌షిప్‌లో స్నేహితులు అశోక్, వినోద్‌లతో కలిసి ఉంటున్నాడు. ఈనెల 16న తన బావ సురేష్‌బాబుకు ఫోన్ చేసి తాను డబ్బు పని మీద బెంగళూరుకు వెళ్తున్నానని, రెండు రోజుల్లో తిరిగి వస్తానని చెప్పి వెళ్లాడు. ఆ రోజు నుంచి ఉదయ్ భాస్కర్ ఎవరికీ అందుబాటులో లేకుండా పోయాడు. అతని రూమ్‌మేట్స్ అశోక్, వినోద్‌తో పాటు కుటుంబ సభ్యులు సరేష్‌బాబును విచారించగా తమకు తెలియదని చెప్పడంతో శుక్రవారం కేపీహెచ్‌బీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంలో 'ఆర్టిజన్' మృతి



బీచ్‌పల్లి (ఫైల్)

బాలానగర్, మార్చి 28(ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతానికి గురై ఓ విద్యుత్ కార్మికుడు మృతి చెందాడు. బాలానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఐడీపీఎల్ కాలనీలో శుక్రవారం రాత్రి ఈ ఘటన జరిగింది. రంగారెడ్డినగర్ సబ్‌డివిజన్ పరిధి సౌభాగ్యనగర్ ఫీడర్ ప్రాగా టూల్స్ ఫ్యూజ్ ఆఫ్ కాల్ (ఎఫ్ఓసీ) ఆఫీసులో బీచ్‌పల్లి(38) ఆర్టిజన్‌గా పనిచేస్తున్నాడు. కొల్లాపూర్ మండలానికి చెందిన ఇత ను భార్య, ఇద్దరు పిల్లలతో కలిసి చింతల్ విజయ్‌నగర్ కాలనీలో నివాసం ఉంటున్నాడు. శుక్రవారం రాత్రి ఐడీపీఎల్ కాలనీలోని ఓ స్తంభం వద్ద ఉన్న ఏబీ స్విచ్‌లో మంటలు వస్తున్నాయని స్థానికుల నుంచి ఫోన్ రావడంతో దానిని సరిచేసేందుకు బీచ్‌పల్లి మరో కార్మికుడితో కలిసి అక్కడి వెళ్లాడు. స్విచ్ బోర్డ్ తెరిచి మరమ్మతు పూర్తి చేసిన బీచ్‌పల్లి.. ఆ తర్వాత స్విచ్ బోర్డు తలుపులు మూసే క్రమంలో కరెంటు తీగలు తగలడంతో విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. అతడి వెంట వచ్చిన సహాయకుడు స్థానికులతో కలిసి అతడిని జీడిమెట్ల రామరాజు మల్టీస్పెషాలిటీ ఆసుపత్రికి తరలించారు. బీచ్‌పల్లికి వైద్య పరీక్షలు చేసిన డాక్టర్లు అప్పటికే అతను చనిపోయినట్టు వెల్లడించారు. బాలానగర్ పోలీసులు మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు. బోయినపల్లి, రంగారెడ్డి నగర్ విద్యుత్ శాఖ అధికారులు హుటాహుటిని గాంధీ ఆసుపత్రికి చేరుకుని బీచ్‌పల్లి మృతికి సంబంధించిన వివరాలను తెలుసుకున్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

కేపీహెచ్‌బీకాలనీ, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన శుక్రవారం కైత్లాపూర్ సమీపంలో ని ఉజ్వల లిక్కర్ మార్ట్ దగ్గర వెలుగు చూసింది. కూకట్‌పల్లి పోలీసుల కథనం ప్రకారం.. గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం పడి ఉందని పోలీసులకు సమాచారం అందడంతో ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతుడి వయస్సు సుమారు 40-45 ఏళ్లు ఉంటాయని పోలీసులు తెలిపారు. భిక్షాటనతో పాటు చుట్టుపక్కల సీసాలు, డబ్బాలు ఏరుకుంటూ రోడ్ల పక్కనే నిద్రిస్తుంటాడని స్థానికులు తెలిపారని పోలీసులు పేర్కొన్నారు. మృతుడికి సంబంధించిన వివరాలు ఎవరికైనా తెలిస్తే పోలీసు స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ప్రణీత్‌గ్రూప్ ఎండీ నరేంద్ర తల్లి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీమంత్రి హరీశ్‌రావు, కూకట్‌పల్లి ఎమ్మెల్యే కృష్ణారావు తదితరులు

ప్రణీత్‌గ్రూప్ ఎండీకి మాతృవియోగం

● పరామర్శించిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు

కూకట్‌పల్లి, మార్చి 28(ఆంధ్రజ్యోతి): ప్రణీత్‌గ్రూప్ ఎండీ నరేంద్ర మాతృమూర్తి శుక్రవారం ఉదయం మృతి చెందారు. సమాచారం అందుకున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు మాజీ మంత్రి హరీశ్‌రావు, కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణరావు, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్, శంబీర్‌పూర్ రాజు నరేంద్ర నివాసానికి వెళ్లి ఆయనను పరామర్శించి తమ ప్రగాఢ సంతాపం తెలియజేశారు.



నూతన కమిటీ సభ్యులతో శేరిలింగంపల్లి అధ్యక్షురాలు చంద్రిక

కాంగ్రెస్ పార్టీ మహిళా కమిటీల నియామకం

హైదర్‌నగర్, మార్చి28 (ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు చంద్రిక ఆధ్వర్యంలో పార్టీ ఏ బ్లాక్ కమిటీ, కూకట్‌పల్లి ఆస్బెస్టాస్ కాలనీ, ఆల్విన్‌కాలనీ డివిజన్ల కమిటీలను వేశారు. ఇందులో భాగంగా రాష్ట్ర మహిళా కాంగ్రెస్ సెక్రటరీ రమాదేవి, అరుణ, ఏ బ్లాక్ అధ్యక్షురాలు శ్రీదేవి, శేరిలింగంపల్లి ఉపాధ్యక్షురాలు తస్వీనర్, జనరల్ సెక్రటరీ కృష్ణకుమారీ, సెక్రటరీ వల్లీకి నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో కూకట్‌పల్లి, ఆల్విన్‌కాలనీ డివిజన్ల అధ్యక్షులు శ్రీజ్యోతి, రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

లౌడ్ స్పీకర్లకు లైసెన్సు తీసుకోవాలి

హైదరాబాద్ సిటీ, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో లౌడ్ స్పీకర్లను వినియోగించాలన్నా, విక్రయించాలన్నా ముందుగా లైసెన్సు తీసుకోవాల్సి ఉంటుందని సైబరాబాద్ కమిషనర్ ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్ సిటీ లౌడ్ స్పీకర్స్ రూల్స్ 1963 ప్రకారం ఔత్సాహికులు దరఖాస్తులు చేసుకుంటే వాటిని పరిశీలించి లైసెన్సులను జారీ చేస్తామని తెలిపారు. ఈ నేపథ్యంలో అవసరమైన దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభమైందని కమిషనర్ తెలిపారు. ఆసక్తిఉన్న వారు మరిన్ని వివరాలకు (www.cyberabad police.gov.in or www.cyberabad police.gov.in.)లో సంప్రదించాలని సూచించారు. దరఖాస్తుల ప్రక్రియ పరిశీలన అంతా ఆన్‌లైన్‌లోనే జరుగుతుందని, ఆసక్తి ఉన్న వారు దరఖాస్తు చేసుకోవచ్చని కమిషనర్ తెలిపారు.

రంజాన్‌కు ఏర్పాట్లు చేయండి : జోనల్ కమిషనర్

గచ్చిబౌలి, మార్చి28 (ఆంధ్రజ్యోతి): రంజాన్ పండుగను పురస్కరించుకొని జోన్ పరిధిలోని అన్నిసర్కిళ్లల్లో కావాల్సిన సౌకర్యాలు తక్షణమే ఏర్పాట్లు చేయాలని జోనల్ కమిషనర్ ఉపేందర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. అందులో భాగంగా శుక్రవారం శేరిలింగంపల్లి, చందానగర్ సర్కిళ్లల్లో ఆయన అధికారులతో కలిసి పర్యటించారు. ప్రార్థనా మందిరాల వద్ద రోడ్లు శుభ్రం చేయాలని, వీధి దీపాలు లేని ప్రాంతాల్లో కొత్తవాటిని ఏర్పాటుచేయాలని, పారిశుధ్య నిర్వహణ పకడ్బందీగా నిర్వహించాలని అన్నారు. మాదాపూర్ డివిజన్ పరిధిలోని కాకతీయ హిల్స్ అలంగీర్ మజీదును అధికారుల బృందం మసీదు ట్రస్టు సభ్యులతో కలిసి జోనల్ కమిషనర్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మసీదుల వద్ద ప్రత్యేక పారిశుధ్య చర్యలను చేపట్టాలని పరిసరాలను పరిశుభ్రంగా తీర్చిదిద్దాలని, అధికారులను ఆదేశించారు. కాకతీయ హిల్స్ రోడ్డు నంబర్ 11 నుంచి శ్రావణి ఆసుపత్రి గుట్టల బేగంపేట వరకు అనుసంధాన రహదారి నిర్మాణ పనులను సకాలంలో పూర్తయ్యేలా చూడాలన్నారు. కార్యక్రమంలో జోనల్ ఎస్సీ శంకర్‌సింగ్, చందానగర్ ఉప కమిషనర్ మోహన్‌రెడ్డి, ఏఈ ప్రశాంతి, డీఈ శ్రీదేవి, వైద్యాధికారి రవి కుమార్ పాల్గొన్నారు.



బహుమతులను ప్రదానం చేస్తున్న హెచ్‌ఎం వసుంధర, నిర్వాహకులు

ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు క్విజ్ పోటీలు

మియాపూర్, మార్చి28(ఆంధ్రజ్యోతి): శ్రీరామకృష్ణ వివేకానంద సేవా సమితి ఆధ్వర్యంలో మియాపూర్, మక్తాలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. ఉత్తిష్ఠ భారత బృందగానం పోటీల్లో సుమారు 72 మంది విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు, సర్టిఫికెట్లను ప్రధానోపాధ్యాయులు వసుంధర, మదన్‌మోహన్, విజయ, సమితి ప్రతినిధి దత్తాత్రేయ ప్రదానం చేశారు.



నేతాజీనగర్‌లో నీటి పొదుపుపై ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, కాలనీ వాసులు

ఇంటింటా ఇంకుడు గుంతలు తవ్వుకోవాలి

గచ్చిబౌలి, మార్చి28 (ఆంధ్రజ్యోతి): ప్రతీ ఒక్కరు నీటిని పొదుపుగా వాడుకొని రాబోయే తరాలకు అందివ్వాలని నేతాజీ నగర్ సంక్షేమ సంఘం అధ్యక్షులు బేరి రాంచందర్ యాదవ్ అన్నారు. శుక్రవారం నేతాజీనగర్‌లో ప్రపంచ నీటి దినోత్సవాన్ని పురస్కరించుకొని నీటిపై అవగాహన కార్యక్రమాన్ని హఫీజ్‌పేట మెట్రో వాటర్ వర్క్స్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రపంచ నీటి దినోత్సవాన్ని పురస్కరించుకొని నీటి పొదుపుపై నెలరోజుల పాటు విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో రాంచందర్ యాదవ్ పాల్గొని ప్రసంగించారు. అంతకు ముందు కాలనీలో ర్యాలీ నిర్వహించారు. ఇంటింటికి కరపత్రాలను పంపిణీ చేశారు. నీటిని వృథా కానివ్వరాదని, ఉన్న నీటిని పొదుపుగా వాడుకోవాలని అన్నారు. కాలనీలో ప్రతి ఇంటి ముందు ఇంకుడు గుంతలను తవ్వుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కాలనీవాసులు, సంక్షేమ సంఘం సభ్యులు మెట్రోవాటర్ సిబ్బంది పాల్గొన్నారు.



క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న బాలింగ్ గౌతంగౌడ్

బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభం

మియాపూర్, మార్చి28 (ఆంధ్రజ్యోతి): హఫీజ్‌పేట ప్రజాసిటీ వెల్ఫేర్ అసోసియేషన్‌లో బాలింగ్ సత్తయ్యగౌడ్ మెమోరియల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు బాలింగ్ గౌతమ్‌గౌడ్ పాల్గొని పోటీలను ప్రారంభించారు. క్రీడలు స్నేహభావాన్ని పెంపొందించడంతో శారీరక, మానసిక ప్రశాంతత కలుగుతుందన్నారు. కార్యక్రమంలో ప్రజయ్‌సిటీ అసోసియేషన్ అధ్యక్షుడు నాయుడు, కేబుల్ రవి, వెంకటేష్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

చెరువుల సుందరీకరణ పనుల పరిశీలన

మియాపూర్, మార్చి28 (ఆంధ్రజ్యోతి): మియాపూర్ డివిజన్ గుర్నాథం చెరువు, పటేల్‌చెరువు పెద్దకుడి చెరువుల సుందరీకరణ పనులను జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి, ఉప కమిషనర్ మోహన్‌రెడ్డి, కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ శ్రీకాంత్ మాట్లాడుతూ, మియాపూర్ డివిజన్ పరిధిలోని గుర్నాథం చెరువు, పటేల్‌చెరువు, పెద్దకుడి చెరువుల పునర్జీవనంలో భాగంగా చేపట్టిన సుందరీకరణ, పునరుద్ధరణ పనులు వేగంగా జరుగుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో మల్లిగవాడ్ ఫౌండేషన్ సభ్యులు రామ్, చైతన్య, జీహెచ్‌ఎంసీ ఆయా శాఖల అధికారులు ఎస్‌ఈ శంకర్, ఈఈ ఇంద్రబాయ్, డీఈ దుర్గాప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

సర్కారు బడి.. కూల్చేందుకు రెడీ

- రోడ్డు విస్తరణలో భాగంగా గచ్చిబౌలి ప్రభుత్వ పాఠశాల భవనాన్ని కూల్చేందుకు సిద్ధమైన అధికారులు
- ప్రత్యామ్నాయం చూపి కూల్చాలంటున్న టీచర్లు, విద్యార్థుల తల్లిదండ్రులు




గచ్చిబౌలి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల

గచ్చిబౌలి, మార్చి28 (ఆంధ్రజ్యోతి): రోడ్డు విస్తరణకోసం శేరిలింగంపల్లి మండలం గచ్చిబౌలి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల కూల్చివేతకు అధికారులు సిద్ధమయ్యారు. ప్రత్యామ్నాయం చూపకుండా ఉన్న పాఠశాలను కూల్చడం ఎంతవరకు సమంజసమంటూ విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గచ్చిబౌలి- కొండాపూర్ రోడ్డు విస్తరణ, గచ్చిబౌలి చౌరస్తాలో భారీ వంతెన కారణంగా రోడ్డు విస్తరణ ప్రాముఖ్యత సంతరించుకుంది. 200 మీటర్లు వరకు విస్తరిస్తున్న రోడ్డులో ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తులు కూడా కోల్పోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. గచ్చిబౌలి ప్రాథమిక పాఠశాలలో సుమారు 550 మంది విద్యాభ్యాసం చేస్తున్నారు. ఇదే ప్రాంగణంలో చిన్న అంజయ్యనగర్, గచ్చిబౌలి ప్రాంతాలకు చెందిన రెండు అంగ్‌వాడీ కేంద్రాలను కూడా నడిపిస్తున్నారు. అయితే రోడ్డు విస్తరణలో ఈ పాఠశాలకు చెందిన ఐదుగదులు, ప్రధానోపాధ్యాయుడి కార్యాలయం. స్టాఫ్, స్టోర్‌రూంలు, రెండు అంగన్‌వాడీ గదులను కూల్చేందుకు అధికారులు సిద్ధమయ్యారు. సుమారు 11 గదులను కూల్చివేసేందుకు రంగం సిద్ధం చేశారు. ప్రధాన రహదారిని అనుకుని ఉన్న ఈ పాఠశాల మనుగడ ప్రస్తుతం ప్రశ్నార్థకంగా మారింది. పాఠశాల ఎదురుగా ఉన్న ప్రధాన రహదారి రోడ్డు మధ్యలో నుంచి 100 అడుగుల మేర విస్తరిస్తున్నారు. అందులో భాగంగానే పాఠశాలకు చెందిన గదులను సైతం కూల్చాల్సి వస్తుంది. విద్యార్థులకు ప్రత్యామాయం చూపకుండా కూల్చడం ఏమిటని ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పాఠశాలకు మరోచోట స్థలం కేటాయించి నూతన భవనం నిర్మించిన తర్వాతే రోడ్డు విస్తరణ చేపట్టాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

కోల్పోతున్న 900 గజాలు, 11 గదులు

రోడ్డు విస్తరణలో పాఠశాలకు చెందిన 11 గదులు, అంగన్‌వాడీ కేంద్రాలతో పాటు కిచెన్ షెడ్లు ఉన్నాయి. సుమారు 900 గజాలు రోడ్డు విస్తరణలో పోతుంది. ఇదిలావుండగా గచ్చిబౌలి, కొండాపూర్ రోడ్డులో నిత్యం విపరీతమైన ట్రాఫిక్ రద్దీ ఉంటుంది. రోడ్డును విస్తరిస్తే కొంతవరకైన ట్రాఫిక్ రద్దీని తగ్గించవచ్చని అధికారులు భావించి రోడ్డు విస్తరణ చేపడుతున్నట్లు తెలుస్తుంది. చౌరస్తాలో ఫైవంతన నిర్మాణ పనులు సాగుతున్నాయి. రాజీవ్‌నగర్ నుంచి గచ్చిబౌలి చౌరస్తా మీదుగా అధికారులు ఔటర్‌వరకు ఈ వంతెన నిర్మాణ పనులు చేపట్టారు. గచ్చిబౌలి చౌరస్తా నుంచి పనులుమొదలు పెట్టి రాజీవ్‌నగర్ వరకు పూర్తిచేశారు. ప్రభుత్వ పాఠశాల వద్ద తాత్కాలికంగా పనులను నిలిపివేశారు. వేసవి సెలవుల్లో పాఠశాల కూల్చే పనికి అధికారులు పూనుకున్నట్లు తెలుస్తుంది.

ఈ అంశాన్ని ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ దృష్టికి తీసుకువెళ్లారు. అయితే కొత్త భవనానికి అవసరమైన ప్రభుత్వ స్థలం శేరిలింగంపల్లిలో లేదని అధికారులు చెబుతున్నారు. భవనం కూల్చకముందే రాబోయే విద్యాసంవత్సరానికి ముందే ప్రత్యాయ్నాయ ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వ సలహాదారు అధికారులను ఆదేశించినట్లు తెలిసింది.

సీఎస్‌ఆర్ నిధులతో భవన నిర్మాణం

ఈ విషయమై ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. రోడ్డు విస్తరణలో స్థలం కోల్పోగా మిగిలిన స్థలంలో కొత్త భవనం నిర్మిస్తామని జీహెచ్‌ఎంసీ అధికారులు హామీ ఇస్తున్నారు. కొత్త భవనం కోసం దాదాపు రూ.3నుంచి 4కోట్లు ఖర్చవుతుందని అంచనా వేశారు. ప్రభుత్వానికి, జీహెచ్‌ఎంసీకి కార్పొరేట్ సంస్థల నుంచి వచ్చే సీఎస్‌ఆర్ నిధులతో ఈ భవనం నిర్మించనున్నారు.

కొత్త భవనం నిర్మాణం వెంటనే చేపట్టాలి

ప్రత్యాయ్నాయ ఏర్పాట్లు చేసిన తర్వాతే భవనం కూల్చాలి. కొత్త భవనం నిర్మాణం వెంటనే చేపట్టాలి. విషయాన్ని ఎమ్మెల్యే, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం. వారంతా ప్రత్యాయ్నాయ మార్గం చూపిన తర్వాతే భవనం కూలుస్తామని హామీ ఇచ్చారు.

- మధుమిత, ప్రధానోపాధ్యాయురాలు

ప్రత్యాయ్నాయ ఏర్పాట్లు చేస్తున్నాం

పాఠశాల భవనం పక్కనే ఉన్న ఉన్నత పాఠశాలలో ప్రత్యాయ్నాయ ఏర్పాట్లు చేస్తున్నాం. ఆ తర్వాతే భవనం కూలుస్తాం. రాబోయే విద్యాసంవత్సరం ప్రారంభానికి ముందే ఏర్పాట్లకు ప్రయత్నిస్తాం. తల్లిదండ్రులు, విద్యార్థులు ఆందోళన చెందొద్దు.

- నగేష్, మండల విద్యాధికారి

పేదలకు అండగా సీఎం రిలీఫ్ ఫండ్: ఎమ్మెల్యే గాంధీ



సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ, కార్పొరేటర్లు

హైదర్‌నగర్, మార్చి28 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో ఉండి ఆస్పత్రిలో బిల్లులు చెల్లించలేని వారికి సీఎం సహాయనిధి అండగా ఉంటుందని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అన్నారు. వివేకానందనగర్‌లోని తన కార్యాలయంలో శుక్రవారం 57మంది సీఎం సహాయనిధి లబ్ధిదారులకు రూ.23,24,000 లక్షలకు సంబంధించిన చెక్కులను ఆయన కార్పొరేటర్లు వెంకటేష్‌గౌడ్, నార్నె శ్రీనివాసరావుతో కలిసి లబ్ధిదారుల కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ సీఎం సహాయనిధి పేదలకు వరం లాంటిదన్నారు. ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం కృషిచేస్తుందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి పేదల పక్షపాతి అని, ఆయన పేదల అభివృద్ధికి కృషిచేస్తున్నారని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు సంజీవరెడ్డి, నాయినేని చంద్రకాంత్‌రావు, పోతుల రాజేందర్, చిట్టిరెడ్డి శ్రీధర్‌రెడ్డి, అనిల్ కావూరి, రాజునాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్లమ్మబండలో దావత్-ఏ-ఇఫ్తార్

రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని ఆల్విన్‌కాలనీ డివిజన్ ఎల్లమ్మబండలో శుక్రవారం స్థానిక కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన దావత్-ఏ-ఇఫ్తార్ విందు కార్యక్రమానికి ఎమ్మెల్యే, ఆరెకపూడి గాంధీ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రంజాన్‌మాసం సందర్భంగా ముస్లిం సోదరులు నిష్టతో పాటించే ఉపవాస దీక్షలు, దైవ ప్రార్థనలతో సామరస్యం, శాంతి సౌభ్రాతృత్వం వెల్లివిరియాలని ఆకాంక్షించారు. అదేవిధంగా తెలంగాణకు ప్రత్యేకమైన గంగా జమునా తెహజీబ్ మరింతగా పరిడవిల్లాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

వసంతరుతువు నిత్యనూతనానికి ప్రతీక: శంకర నారాయణ




కవిసమ్మేళనంలో కళాకారులు, భక్తులు, మాట్లాడుతున్న హాస్యబ్రహ్మ శంకరనారాయణ

ఖేల్‌కాలనీ, మార్చి 28(ఆంధ్రజ్యోతి): వసంత రుతువు నిత్యనూతనానికి ప్రతీకని, వసంతమాసంతో ప్రకృతిలో వచ్చే సహజసిద్ధమైన మార్పులు శుభసూచికాలని హాస్య బ్రహ్మ, సీనియర్ పాత్రికేయుడు డాక్టర్ శంకర నారాయణ అన్నారు. విశ్వావసు నామ సంవత్సరం ఉగాది పురస్కరించుకుని ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ రామస్వామి యాదవ్ ఆధ్వర్యంలో చందానగర్‌లో గల శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో కవి సమ్మేళనం జరిగింది. కార్యక్రమంలో హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ తెలుగు శాఖ ఆచార్యలత, డాక్టర్ ములుగు అంజయ్య, శతావధాని చింతా రామకృష్ణారావు, సంచాలక చక్రవర్తి కటకం వెంకటరామశర్మతో పాటు స్థానిక కవులు, కళాకారులు కవితలని ఆలపించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి శంకరనారాయణ మాట్లాడుతూ ఉగాది సందర్భంగా పంచాంగ శ్రవణం.. కవి సమ్మేళనం నిర్వహించడం అనాధిగా వస్తున్న సనాతన సాంప్రదాయమన్నారు. ఈ సందర్భంగా 63 మంది తమ కవితా మాధుర్యాన్ని వినిపించి శ్రోతలను మంత్రముగ్ధులను చేశారు. కార్యక్రమంలో ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు విజయలక్ష్మి, వాణి సాంబశివరావు, అమ్మయ్య చౌదరి, పాలం శ్రీనివాస్, సండూరి వెంకటేశ్వరరాజు, జీవి.రావు పాల్గొన్నారు.

తొమ్మిది రోజులు నవరాత్రి ఉత్సవాలు

ఖేల్‌కాలనీ, మార్చి 28(ఆంధ్రజ్యోతి): తెలుగు సంవత్సరాది విశ్వావసు సంవత్సరం సందర్భంగా భెల్ ఎంఐజీ కాలనీలోగల రామాలయంలో ఆదివారం నుండి తొమ్మిదిరోజుల పాటు వసంత నవరాత్రి మహోత్సవాలను నిర్వహించనున్నట్లు ఆలయ అధ్యక్షుడు భీంరెడ్డి తెలిపారు. ఉగాది పండుగ నుండి ఏప్రిల్ 6వ తేదీ శ్రీ రామనవమి వరకు నవ రాత్రి మహోత్సవాలు జరుగుతాయన్నారు. ఆదివారం స్వామి వారి కల్యాణ మండపంలో ఆలయ ప్రధాన అర్చకులు పెద్దింటి వెంకట భాస్కరాచార్యులుచే పంచాంగ శ్రవణం జరుగుతుందన్నారు. ప్రతీ రోజు శ్రీ సీతారామ లక్ష్మణ స్వామిలకు నిత్యపూజలతో పాటు విశేష అభిషేకాలు, పంచామృతాభిషేకాలు, అర్చనలు జరుగుతాయన్నారు. మూల-ఉత్సవ విగ్రహాలకు అభిషేకంతో మహోత్సవాలు ప్రారంభమౌతాయని, ఏప్రిల్ 6న శ్రీరామనవమిన జరిగే సీతారామ కల్యాణ మహోత్సవం ఎంఐజీకాలనీలో జరిగే ఊరేగింపుతో నవరాత్రి ఉత్సవాలు ముగుస్తాయన్నారు. తొమ్మిది రోజుల పాటు అభిషేకాలు, అర్చనలు, నృత్య ప్రదర్శనలు, సంగీత విభావరి, నాట్య ప్రదర్శనలు జరుగుతాయన్నారు. కల్యాణంలో పాల్గొనదలచిన భక్తులు ఆలయ కార్యాలయంలో తమ పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు.



సీతారాముల మూల విగ్రహాలు



ఎంఐజీకాలనీలోగల రామాలయం

శీతల పానియాలకు మస్తు గిరాకీ

రాయదుర్గం, మార్చి28 (ఆంధ్రజ్యోతి): నగరంలో రోజురోజుకు ఎండలు మండిపోతున్నాయి. దీంతో ఇంటి నుంచి బయటకు రావాలంటేనే ప్రజలు జంకుతున్నారు. ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులు ఇబ్బందులు పడుతున్నారు. వివిధ పనుల మీద బయటకు వచ్చేవారు ఎండ వేడినుండి ఉపశమనం పొందేందుకు రకరకాల శీతల పానియాలు, జ్యూస్‌లను ఆశ్రయిస్తున్నారు. ముఖ్యంగా కొబ్బరినీళ్లు, పుచ్చకాయ, చెరకురసం, పండ్లరసాలు, శీతలపానియాలు తాగేందుకు ఇష్టపడుతున్నారు. ఉదయం 11గంటల నుంచే రాయదుర్గం, గచ్చిబౌలి, నానక్‌రాంగూడ, మాదాపూర్, కొండాపూర్, హఫీజ్‌పేట, మియాపూర్, లింగంపల్లి ప్రాంతాల్లోని రహదారుల పక్కనున్న ఈ దుకాణాలు ప్రజలతో సందడిగా మారిపోయాయి.

కనీస జాగ్రత్తలు తీసుకుంటే మంచిది

- కొన్ని రసాయనాలతో తయారు చేసిన జ్యూస్‌లకు శీతల పానియాలకు దూరంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు.



చెరుకు రసం తాగుతున్న మహిళలు

- మజ్జిగ, కొబ్బరినీళ్లు రాగిజావ వంటివి తాగడం మంచిదంటున్నారు. జ్యూస్‌లు, చెరకు రసం లాంటివి తాగే సమయంలో వాటిలో కొంతమంది వ్యాపారులు నాణ్యతలేని ఐస్ వాడుతున్నారు. ఇలాంటి వాటిపై కాస్త జాగ్రత్త వహిస్తే మంచిదని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.

హెచ్‌సీయూ భూముల్లో జింకలు



ఏబీవీపీ విడుదల చేసిన ఫొటో

రాయదుర్గం, మార్చి28 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూముల్లో గుంట నక్కలు తప్ప ఇతర జీవరాసులు లేవని చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్న వర్సిటీ ఏబీవీపీ నాయకులు వీడియోలను, ఫొటోలను విడుదల చేశారు. శుక్రవారం వర్సిటీ భూముల్లో సంచరిస్తున్న జింకల ఫొటోలను వారు విడుదల చేశారు.



మాట్లాడుతున్న ఏబీవీపీ నాయకులు

వర్సిటీ భూమిని ఇంచు కూడా వదులుకోం

రాయదుర్గం, మార్చి28(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి చెందిన ఇంచు భూమిని కూడా వదులుకోబోమని, భూములను కాపాడుకునే విషయంలో ఒక్క అడుగు కూడా వెనక్కు వేయమని ఏబీవీపీ విద్యార్థి సంఘం నేషనల్ కన్వీనర్ బాలకృష్ణ స్పష్టం చేశారు. శుక్రవారం హెచ్‌సీయూ యూనివర్సిటీ వద్ద మీడియా సమావేశంలో ఏబీవీపీ విద్యార్థులు మాట్లాడుతూ అసెంబ్లీ సమావేశాల సందర్భంగా అసెంబ్లీ సాక్షిగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హెచ్‌సీయూ భూముల విషయంలో అక్కడ కొన్ని గుంట నక్కలు చేరి హడావిడి చేస్తున్నాయని అనడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. హెచ్‌సీయూలో పులులు లేవు, జింకలు లేవు, గుంట నక్కలు ఉన్నాయని అనడం సిగ్గుచేటన్నారు. సీఎం తన బుద్ధిమార్చుకోవాలని, ఇంకా ఆయన తన రియల్ ఎస్టేట్ బుద్ధి చూపెడుతున్నారని వేల కోట్ల విలువైన భూములను అమ్మేందుకు యత్నిస్తున్నారని మండిపడ్డారు. హెచ్‌సీయూలో వందలాది జింకలు, నెమళ్లు, పులులు, నక్షత్ర తాంబేళ్లు ఉన్నాయని, యూనివర్సిటీ ఏర్పాటుకోసం ఎంతోమంది పోరాటాలు చేశారని అన్నారు. సెంట్రల్‌వర్సిటీకి చెందిన 2,374 ఎకరాలు కాకుండా మీరు అమ్మకానికి పెట్టిన 400ఎకరాలు ఎక్కడ ఉన్నాయో చెప్పాలన్నారు. విద్యార్థి సంఘాలను అడ్డు పెట్టుకుని డ్రామాలు ఆడుతున్నారని, విద్యార్థి సంఘాల పవర్ ఏంటో చూపిస్తామన్నారు. ఇదే వర్సిటీలో చదువుకున్న డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్‌బాబు నోటికి వచ్చింది మాట్లాడుతున్నారని హెచ్‌సీయూ భూములను చెరబట్టాలని చూస్తే సహించేది లేదని హెచ్చరించారు.

వేడుకలకు ఆలయాల ముస్తాబు



వేంకటేశ్వర స్వామి దివ్య విగ్రహం

ఖేల్‌కాలనీ, మార్చి 28(ఆంధ్రజ్యోతి): ఉగాది పండుగ సందర్భంగా అన్ని దేవాలయాలను విద్యుత్ దీపాలతో, పుష్పాలతో సుందరంగా అలంకరించారు. భెల్ టౌన్‌షిప్‌లోగల శ్రీ వేంకటేశ్వర యోగేశ్వరస్వామి దేవస్థానం, శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవాలయం, మురళీకృష్ణ దేవాలయం, కనకదుర్గా దేవి ఆలయం, ఎంఐజీ కాలనీలోగల శివాలయం, జ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయం, శ్రీ వల్లీ దేవసేన సుబ్రహ్మణ్యేశ్వర స్వామి, హనుమాన్ దేవాలయాలు వేడుకలకు సిద్ధమయ్యాయి. నిత్యపూజలతో పాటు విశేష అభిషేకాలు, అర్చనలు నిర్వహించనున్నారు. స్వామి వారి మహా మండపంలో స్థానిక ప్రధాన అర్చకులచే పంచాంగ శ్రవణం తదితర విశేష పూజా కార్యక్రమాలను జరుగనున్నాయి. కాలనీలోగల పెద్దమ్మ తల్లి ఆలయం,శ్రీ కనకదుర్గా దేవి ఆలయాల్లో విశేష పూజా కార్యక్రమాలను నిర్వహించనున్నట్టు ఆలయ నిర్వాహకులు తెలిపారు.



సుభాష్ చంద్రబోస్ నగర్‌లోని ఎన్టీఆర్ విగ్రహాన్ని శుద్ధి చేస్తున్న టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు బక్కని నరసింహులు, సాంబశివగౌడ్

మొట్టమొదటి ఎన్టీఆర్ విగ్రహం పాలతో శుద్ధి

మియాపూర్, మార్చి28 (ఆంధ్రజ్యోతి): మాదాపూర్ డివిజన్ సుభాష్ చంద్రబోస్‌నగర్‌లో శేరిలింగంపల్లి టీడీపీ సీనియర్ నాయకుడు ఆరేపల్లి సాంబశివగౌడ్ ఆధ్వర్యంలో నియోజకవర్గ మొట్టమొదటి ఎన్టీఆర్ విగ్రహం శుభ్రపరిచే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు, సీనియర్ నాయకుడు బక్కని నరసింహులు హాజరై ఎన్టీఆర్ విగ్రహాన్ని పాలతో శుద్ధి చేశారు. కార్యక్రమంలో చేవెళ్ల పార్లమెంట్ కన్వీనర్ కట్ట వెంకటేష్‌గౌడ్, సీనియర్ నాయకులు శ్రీహరియాదవ్, సయ్యద్ సిరాజుద్దీన్, గోపాల్‌యాదవ్, విజయకృష్ణ, కోటేశ్వరరావు, బాబా, తదితరులు పాల్గొన్నారు.



సీనియర్ సిటిజన్స్‌తో ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

నిరు పేదలకు వరం సీఎం సహాయ నిధి

పేట్‌బషీరాబాద్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ఆపదలో ఉన్న నిరు పేదలకు వరం ముఖ్యమంత్రి సహాయ నిధి అని ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. గాజులరామారం డివిజన్ ఇందిరానగర్‌కు చెందిన అల్లుకూటురు ముత్తు స్వామి ఆరోగ్య పరిస్థితి సరిగా లేదని ఎమ్మెల్యే దృష్టికి తీసుకు వచ్చారు. దీంతో ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ.2 లక్షల ఎల్‌ఓసీని శుక్రవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో అందజేశారు. కార్యక్రమంలో జగద్గిరిగుట్ట బీఆర్ఎస్ అధ్యక్షులు అశోక్, కుత్బుల్లాపూర్ డివిజన్ ప్రధాన కార్యదర్శి సత్తిరెడ్డి, బీఆర్ఎస్ నాయకులు సాయికిరణ్ పాల్గొన్నారు.

మరో కార్యక్రమంలో

పేట్‌బషీరాబాద్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో కుత్బుల్లాపూర్ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యులు ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. అధ్యక్షుడు నర్సింహారెడ్డి, సలహాదారుడు బల్వంత్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి మల్లేశం, కోశాధికారి మురళీ గౌడ్, ఉపాధ్యక్షులు లింగంగౌడ్, నగేష్ కుర్మా, సభ్యులను ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ శాలువాతో సన్మానించారు.



డీజీఎంకు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

సూరారంలో నీటి సమస్యను పరిష్కరించాలి

● డీజీఎంకు సీపీఎం వినతి

షాపూర్‌నగర్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): సూరారం డివిజన్ పరిధిలోని షాపూర్‌నగర్, సంజయ్‌గాంధీనగర్, కళావతినగర్, న్యూ షాపూర్‌నగర్ తదితర బస్తీలలో మంచినీటి సమస్యను పరిష్కరించాలని సీపీఎం కుత్బుల్లాపూర్ మండల కార్యదర్శి లక్ష్మణ్ ఆధ్వర్యంలో డీజీఎం రాజుకు వినతిపత్రం అందజేశారు. వేసవికి ముందే డివిజన్‌లోని పలుకాలనీలు, బస్తీలో నీటి ఎద్దడి రావడంతో ప్రజలు తాగునీటికి ఇబ్బంది పడుతున్నారు. తాగునీటి ఎద్దడిని నివారించేందుకు జలమండలి అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని, తాగునీటి సమస్యను పరిష్కరించాలని వినతిపత్రంలో కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు పి.అంజయ్య, శ్రీను, యాదయ్య, దేవదానం, లక్ష్మీ, కార్యకర్తలు ఉన్నారు.

● కుత్బుల్లాపూర్‌లో నీటి కొరత

కుత్బుల్లాపూర్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధిలో నీటి కొరత తీవ్రంగా ఉంది. పలు కాలనీల ప్రజలు వేయించుకున్న బోర్లు అడుగంటడంతో ప్రభుత్వం నుంచి వచ్చే వాటర్ ట్యాంకర్ల మీద ఆధార పడుతున్నారు. వాటర్ ట్యాంకర్లు కూడా సమయానికి రావడంలేదని, ప్రజలకు అవసరమైన వెంటనే ట్యాంకర్లను పంపించేందుకు అధికారులు కృషి చేయాలని ప్రజలు కోరుతున్నారు.



బాపూనగర్‌లో ట్యాంకర్ ద్వారా నీరు పోయించుకుంటున్న ఇంటి యజమాని



వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ సురేష్‌కుమార్

మహిళను హత్యచేసిన వ్యక్తికి రిమాండ్

జీడిమెట్ల, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ఓ మహిళను లైంగికంగా వాడుకుని, దారుణంగా హత్యచేసి తప్పించుకు తిరుగుతున్న నిందితుడిని సనత్‌నగర్ పోలీసులు అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించారు. బాలానగర్ డీసీపీ కార్యాలయంలో శుక్రవారం డీసీపీ కె.సురేష్‌కుమార్ విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఈ నెల 26న రాత్రి 11 గంటల సమయంలో ఎర్రగడ్డలోని సాయిబాబా రిఫ్రిజిరేటర్ వర్క్స్ యజమాని షేక్‌నయూమ్ అనే వ్యక్తి సనత్‌నగర్ పోలీసులకు ఫోన్‌చేసి గుర్తు తెలియని 50 సంవత్సరాల వయస్సు కలిగిన మహిళా రోడ్డు పక్కన బట్టలు లేకుండా మృతి చెంది ఉందని తెలిపారు. సీఐ కె.శ్రీనివాసులు తన సిబ్బందితో అక్కడికి చేరుకుని శవాన్ని స్వాధీనం చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. సీసీ కెమెరాల ఆధారంగా 26వ తేది సాయంత్రం 6 గంటల సమయంలో దాదాపు 50 సంవత్సరాల వయస్సు కలిగిన ఓ మహిళను తీసుకుని వచ్చి ఓ వ్యక్తి లైంగిక చర్యకు పాల్పడి ఆ తర్వాత మద్యం మత్తులో ఉన్న ఆమెను గుండెపై, తలపై బలంగా కొట్టి హత్యచేసి పారిపోయాడు. సీసీ కెమెరాల ఆధారంగా నిందితుడు జనగాం జిల్లా, బచ్చన్నపేట్ గ్రామానికి చెందిన కొమ్మరాజు కనకరాజు(35) అలియాస్ రాజుగా గుర్తించారు. ఇతను 7 సంవత్సరాల క్రితం బతుకు దెరువు కోసం నగరానికి వచ్చి సనత్‌నగర్‌లో నివాసముంటున్నాడు. గతంలో ఇతను దొంగతనం కేసులో జైలుకు వెళ్లాడు. ఈ నెల 28న బాలానగర్ శోభనాథియేటర్ వద్ద తిరుగుతుండగా పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా హత్యకు పాల్పడినట్టు అంగీకరించాడు. కేసు నమోదు చేసిన సనత్‌నగర్ పోలీసులు రిమాండ్‌కు తరలించారు. విలేకరుల సమావేశంలో అడిషనల్ డీసీపీ సత్యనారాయణ, బాలానగర్ ఏసీపీ హనుమంతురావు, సనత్‌నగర్ సీఐ కె.శ్రీనివాసులు, ఎస్ఐలు రాధాకృష్ణ, డి.శ్రీనివాసులు, బాలకృష్ణ పాల్గొన్నారు.

ప్రైవేట్ బస్సు ఢీ కొని మహిళ మృతి

పేట్ బషీరాబాద్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): నడుచుకుంటూ వెళ్తున్న ఓ మహిళను ప్రైవేట్ బస్సు ఢీ కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందింది. పేట్ బషీరాబాద్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం అంబాల గ్రామానికి చెందిన బద్ధం దశరథరెడ్డి, సుజాతరెడ్డి(50) దంపతులు బతుకుదెరువు కోసం కొంపల్లి మున్సిపాలిటీలోని మరాఠీ బస్తీలో పది సంవత్సరాల నుంచి నివాసముంటున్నారు. ఇటీవల ఆమె భువనగిరిలోని స్వగ్రామానికి వెళ్లింది. శుక్రవారం మధ్యాహ్నం కొంపల్లిలో దిగి తానుంటున్న ఇంటికి నడుచుకుంటూ సుజాతరెడ్డి రోడ్డు దాటుతుండగా వెనుక నుంచి వేగంగా వచ్చిన ప్రైవేట్ బస్సు (టీజీ 08 టీ 7616) ఢీ కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందింది. గమనించిన స్థానికులు పేట్ బషీరాబాద్ పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే అక్కడికి చేరుకున్న పోలీసులు వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం గాంధీకి తరలించి దర్యాప్తు చేస్తున్నారు. బస్సును అక్కడే వదిలేసి డ్రైవర్ అక్కడి నుంచి పరారయ్యాడు. దీంతో ట్రాఫిక్ జామ్ కావడంతో పోలీసులు వచ్చి క్లియర్ చేశారు.



సుజాత(ఫైల్)

అపరిశుభ్రతకు కేరాఫ్‌గా హోటళ్లు

● ప్రజల ఆరోగ్యానికి ముప్పు ● పట్టించుకోని అధికారులు

కుత్బుల్లాపూర్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ప్రజా ఆరోగ్యానికి హాని కలిగించే ఆహార పదార్థాల తయారీలో నాణ్యతా ప్రమాణాలు పాటించడంలేదు. మాంసం దుకాణాలు అపరిశుభ్రంగా ఉండడం వినయోగదారుల ఆరోగ్యానికి హాని కలుగుతుంది. కొన్ని హోటళ్లలో వంట గదులు అపరిశుభ్రంగా ఉండడం, పురుగులు, బొద్దింకలు సంచరిస్తున్నా... యజమానులు పట్టించుకోకుండా కస్టమర్లకు వేడి వేడిగా ఆహార పదార్థాలను తయారుచేసి ఇస్తున్నారు. ఆరోగ్యానికి హాని కలిగించే విధంగా ఉన్నా అధికారులు పట్టించుకోవడంలేదు. కొన్ని చోట్ల ఫ్రిడ్జ్‌లో నిల్వ ఉంచిన ఆహార పదార్థాలను వాడుతున్నారు. దీనికి తోడు కల్తీ పదార్థాలను ఆ ఆహార పదార్థాల్లో కలుపుతూ ప్రజల ఆరోగ్యంతో చలగాటం ఆడుతున్నారు. సిబ్బంది కూడా శుభ్రంగా ఉండడంలేదు. ఇంత జరుగుతున్నా సర్కిల్ అధికారులు పట్టించుకోవడంలేదని పలువురు ప్రశ్నిస్తున్నారు. హోటళ్లలో నాణ్యత లేని ఆహార పదార్థాలు తినడంతో పలువురికి కడుపు నొప్పి, వాంతులు, విరోచనాలతో పాటు దీర్ఘ కాలిక వ్యాధులు వచ్చే అవకాశముందని వైద్యులు తెలుపుతున్నారు. జంట సర్కిళ్ల పరిధిలో వందల సంఖ్యలో చికెన్, మటన్ సెంటర్లున్నాయి. దుకాణదారుడు నిబంధనల ప్రకారం విక్రయాలు జరపాలి. కానీ రోడ్ల పక్కన మటన్, చికెన్ సెంటర్లను ఏర్పాటు చేసి దుమ్ము పడుతున్నా అలాగే విక్రయాలు జరుపుతున్నారని సమాచారం.

నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ప్రాంతాలు..

● గాజులరామారం సర్కిల్ చింతల్ పాత కృష్ణ హోటల్ సమీపంలో రోడ్డుపైనే వంట పొయ్యి పెట్టి పూరీలు, వడలు, బజ్జీలు వేస్తుంటారు. అది కూడా ఒక కిలో నూనె పోసి నల్లగా మరిగినప్పటికీ అదే నూనెలో మరోసారి టిఫిన్స్ తయారు చేస్తున్నారని పలువురు తెలపారు.

● సూరారం డివిజన్ షాపూర్‌నగర్‌లోని యూనియన్ బ్యాంక్ ఎదురుగా ఓ టిఫిన్ సెంటర్‌ను రోడ్డుకు పక్కనే ఏర్పాటు చేశారు. అది కూడా డ్రైనేజీ పైప్‌లైన్ మీదపెట్టడం, అక్కడే రంగుల డబ్బాలలో పిండి కలుపుతూ వండడం కన్పిస్తుంది. దుమ్ము, దూళి టేబుల్‌పై పెట్టిన మిర్చి బజ్జీలు, సమోసాలపై పడినప్పటికీ అలాగే విక్రయిస్తున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

● ఉషోదయ చౌరస్తాలోని ప్రధాన హోటల్ కిచెన్‌లో కనీస నిబంధనలు పాటించకుండా ఆహార పదార్థాలను తయారు చేస్తున్నట్లు సమాచారం. హోటల్ పైన నుంచి వచ్చే వేస్టేజీ వాటర్‌ను పైప్‌ల ద్వారా కిందికి తీసుకువచ్చి ప్లేట్లను కడుగుతున్నారని విశ్వసనీయ వర్గాల సమాచారం.

● జీడిమెట్ల గ్రామం అన్నపూర్ణ దేవాలయం ఎదురుగా ఓ హోటల్ నిర్వాహకుడు ఆరుబయట టిఫిన్స్ పెట్టి వ్యాపారం చేస్తున్నాడు. అందులో రోడ్డుపై దుమ్మంతా పడుతుందని అక్కడికి వచ్చే వారు తెలుపుతున్నారు.

డిప్యుటేషన్‌లో అధికారులు

ఈవిషయంపై గాజులరామారం సర్కిల్ అధికారి పవన్ కుమార్‌ను వివరణ కోరగా... తాను నెల రోజుల నుంచి సీఎం రేవంత్‌రెడ్డి కాన్వాయ్‌లో ఉన్నానని, డిప్యుటేషన్‌పై వచ్చానన్నారు. కుత్బుల్లాపూర్ ఫుడ్ సేఫ్టీ అధికారి కూడా డిప్యుటేషన్‌పై వెళ్లినట్లు ఆయన స్పష్టం చేశారు.



డ్రైనేజీ లైన్ వద్ద డబ్బాలో బజ్జీల పిండి, చేతులకు గ్లౌజ్ లేకుండా టిఫిన్స్ కడుతున్న నిర్వాహకుడు, మరిగిన నూనె

నిబంధనలు..

● హోటల్‌లో పరిశుభ్రంగా పెట్టుకోవాలి. ఎక్కడ కూడా దుమ్ము, దూళి లేకుండా చూసుకుని ఎప్పటికప్పుడు ఆహార పదార్థాలు నిల్వ ఉంచకుండా తాజాగా వడ్డించాలి.

● హోటల్‌లో పని చేసే సిబ్బంది చేతులను శుభ్రంగా కడుక్కోవాలి. చేతికి గ్లౌజులు, మూతికి మాస్కులు, వెంట్రుకలు పడకుండా తలకు కూడా జాగ్రత్తలు తీసుకోవాలి.

● తయారు చేసిన ఆహార పదార్థాల మీద ఈగలు, దోమలు వాలకుండా మూతలు ఏర్పాటు చేయాలి.

●. కస్టమర్లకు వేడి వేడిగా ఆహారాన్ని అందించాలి.

● మాంసంతో పాటు పప్పులు, ఇతర ఆహార పదార్థాలను నిల్వ పెట్టకుండా అప్పటికప్పుడు తెచ్చి వంట చేసి ప్రజలకు అందించాలి.

అధ్వానంగా రోడ్లు...

● అవస్థలు పడుతున్న ప్రజలు

గాజులరామారం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): గాజులరామారం డివిజన్‌లో ప్రధాన, అంతర్గత రోడ్లు అధ్వానంగా దర్శనం ఇస్తున్నాయి. ముఖ్యంగా మహదేవపురం చౌరస్తా, దేవేందరనగర్ చౌరస్తా, కైసర్‌నగర్ బస్తీలోను అంతర్గత రోడ్లు పాడైపోయి స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. మహదేవపురం చౌరస్తాలో భారీ వాహనాలు రాత్రి పగలు రాకపోకలు సాగించడంతో రోడ్డంతా గుంతలు మయంగా మారింది, ద్విచక్ర వాహనదారులు గుంతలో పడి గాయాలపాలవుతున్నారు. కైసర్‌నగర్ బస్తీలోని ఏ రోడ్డు చూసినా కంకర తేలిన రోడ్లు, అడుగులోతు గుంతలు ఏర్పడి వాహనదారులు రోడ్ల వెళ్లాలంటేనే భయపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పదించి గుంతలు పడిన రోడ్లలను బాగు యేయాలని పలువురు కోరుతున్నారు.



మహదేవపురం, కైసర్‌నగర్ బస్తీలో రోడ్ల దుస్థితి



ఆటోలు, స్కూల్ బస్సులు, కంపెనీల బస్సులతో రద్దీగా ఉన్న బాలానగర్-సూరారం రోడ్డు



అడ్డుగా వచ్చిన వాహనాలతో రోడ్డుపై నిలిచిన వాహనాలు

సాయిబాబానగర్ చౌరస్తాలో ట్రాఫికర్

● నరకం చూస్తున్న వాహనదారులు

దుండిగల్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): సూరారం సాయిబాబానగర్ చౌరస్తాలో ఉదయం, సాయంత్రం వాహనాల రద్దీతో ట్రాఫిక్ సమస్య జఠిలంగా మారుతుంది. ట్రాఫిక్ సమస్యను పరిష్కరించడానికి అప్పుడప్పుడు ట్రాఫిక్ కానిస్టేబుల్ దర్శనమిస్తాడు, కొంచెం చేపు ఉండి వెళ్లిపోతాడు. ట్రాఫిక్ సమస్యతో ఉద్యోగాలకు వెళ్లే వాహనదారులు నరకం చూస్తున్నారు. సాయిబాబానగర్ నుంచే వాహనాలు, ఇటు బాలానగర్, సూరారం వైపు వెళ్లే వాహనాలు కుడి వైపునకు మళ్లాలి, ఇదే క్రమంలో లక్కీ రెస్టారెంట్ గల్లీ నుంచి వచ్చేవాహనాలు, నేరుగా సూరారం చౌరస్తాకు వెళ్లి మలుపుకుని రావాలి, కాని ఇదే చౌరస్తాలో అడ్డదారుల్లో వస్తూ, బాలానగర్‌వైపు వేళ్లే వాహనాలు, సూరారం వైపు నుంచి జీడిమెట్ల వెళ్లే వాహనాలకు, సాయిబాబానగర్ నుంచి సూరారంవైపు, జీడిమెట్ల వైపుకు వేళ్లే వాహనాలు అడ్డదిడ్డంగా వెళ్తున్నారు. ఈ సమస్యతో ట్రాఫిక్ మరింత జటిలంగా మారుతుంది. ఉదయం 7 గంటలు మొదలు కొని తొమ్మిదిన్నర గంటల వరకు ఈ సమస్య సమస్యగానే కొనసాగుతుంది. అప్పుడప్పుడు ట్రాఫిక్ సీఐ ఆదేశాల మేరకు 8-9 గంటల మధ్య ఓ కానిస్టేబుల్ దర్శనమించి కొద్ది చేపు ఉండి వెళ్లిపోతున్నాడు. అడ్డదిడ్డంగా వచ్చే వాహనాలపైన ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు. ప్రత్యేకంగా లక్కీ రెస్టారెంట్ పక్క సందులో నుంచి వస్తున్న వాహనాలు ట్రాక్టర్‌లు, ఆటోలను సూరారం చౌరస్తా వైపు మళ్లే విధంగా కఠిన నిర్ణయాలు తీసుకుంటే ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం దొరుకుతుంది. ట్రాఫిక్‌కు తోడు సాయిబాబానగర్ చౌరస్తా బస్టాప్‌లో జీడిమెట్ల వైపు బస్సుల కోసం ఎదురు చూస్తున్న ప్రయాణికులకు ఆటోలు అడ్డదిడ్డంగా పెట్టి నరకం చూపిస్తున్నారు.

డ్రైవర్ హారన్ కొట్టిన కదలరు. తప్పని పరిస్థితుల్లో నడిరోడ్డుపైనే బస్సులు ఆపాల్సివస్తుంది.ప్రయాణికులు ఆటోలను దాటుకుంటూ బస్సులు ఎక్కాల్సిన పరిస్థితి నెలకొంది. దీనిపై కూడా దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.



విద్యార్థులకు సర్టిఫికెట్లు, మెడల్స్ అందజేస్తున్న అతిథులు

ఘనంగా గ్రాడ్యుయేషన్ డే

నిజాంపేట్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): బాచుపల్లిలోని మమత నర్సింగ్ కళాశాల విద్యార్థుల గ్రాడ్యుయేషన్ డే శుక్రవారం ఘనంగా జరిగింది. మొదటి బ్యాచ్ పూర్తి చేసుకున్న 133 మంది విద్యార్థులు సర్టిఫికేట్‌లు అందుకున్నారు. గ్రాడ్యుయేషన్‌కు ముఖ్య అతిథిగా కేఎన్ఆర్ విశ్వవిద్యాలయ వైస్ చాన్స్‌లర్ డాక్టర్ నందకుమార్‌రెడ్డి, మమత ఎడ్యుకేషన్ సొసైటీ చైర్మన్ పువ్వాడ అజయ్‌కుమార్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ పువ్వాడ నైనరాజ్, డీన్ పి.హరికృష్ణ, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ సురేష్‌కుమార్ పటేల్, ఈ సందర్భంగా వారు విద్యార్థులకు పలు సూచనలు చేస్తూ వృత్తి ఎంతో పవిత్రమైనది, దానిని దుర్వినియోగం చేయకుండా సమాజంలో మంచి మార్గంలో నడుచుకోవాలని సూచించారు.



● సంక్షేమ సంఘం సభ్యులకు సన్మానం

హరిజన బస్తీ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా నాల్గవ సారి గెలుపొందిన జి. బలరామ్, ప్రధాన కార్యదర్శి బాలరాజ్, కార్యదర్శి జి. పరమేశ్వర్లు, సభ్యులు కుత్బుల్లాపూర్‌లోని బీజేపీ కార్యాలయంలో బీజేపీ మేడ్చల్ జిల్లా, అర్బన్ జిల్లా కార్యదర్శి భరత్ సింహారెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా వారిని ఆయన సన్మానించారు.

- పేట్‌బషీరాబాద్, ఆంధ్రజ్యోతి

వర్సిటీ భూమిని ఇంచు కూడా వదులుకోం

● ఏబీవీపీ విద్యార్థి సంఘం నాయకులు

రాయదుర్గం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి చెందిన ఇంచు భూమిని కూడా వదులుకోబోమని, భూములను కాపాడుకునే విషయంలో ఒక్క అడుగు కూడా వెనక్కు వేయమని ఏబీవీపీ విద్యార్థి సంఘం నేషనల్ కన్వీనర్ బాలకృష్ణ స్పష్టం చేశారు. శుక్రవారం హెచ్‌సీయూ యూనివర్సిటీ వద్ద మీడియా సమావేశంలో ఏబీవీపీ విద్యార్థులు మాట్లాడుతూ అసెంబ్లీ సమావేశాల సందర్భంగా అసెంబ్లీ సాక్షిగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హెచ్‌సీయూ భూముల విషయంలో అక్కడ కొన్ని గుంట నక్కలు చేరి హడావిడి చేస్తున్నాయని అనడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. హెచ్‌సీయూలో పులులు లేవు, జింకలు లేవు, గుంట నక్కలు ఉన్నాయని అనడం సిగ్గుచేటన్నారు. సీఎం తన బుద్ధిమార్చుకోవాలని, ఇంకా ఆయన తన రియల్ ఎస్టేట్ బుద్ధి చూపెడుతున్నారని వేల కోట్ల విలువైన భూములను అమ్మేందుకు యత్నిస్తున్నారని మండిపడ్డారు. హెచ్‌సీయూలో వందలాది జింకలు, నెమళ్లు, పులులు, నక్షత్ర తాంబేళ్లు ఉన్నాయని, యూనివర్సిటీ ఏర్పాటుకోసం ఎంతోమంది పోరాటాలు చేశారని అన్నారు. సెంట్రల్‌వర్సిటీకి చెందిన 2,374 ఎకరాలు కాకుండా మీరు అమ్మకానికి పెట్టిన 400ఎకరాలు ఎక్కడ ఉన్నాయో చెప్పాలన్నారు. విద్యార్థి సంఘాలను అడ్డుపెట్టుకుని డ్రామాలు ఆడుతున్నారని, విద్యార్థి సంఘాల పవర్ ఏంటో చూపిస్తామన్నారు. ఇదే వర్సిటీలో చదువుకున్న డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్‌బాబు నోటికి వచ్చింది మాట్లాడుతున్నారని హెచ్‌సీయూ భూములను చెరబట్టాలని చూస్తే సహించేది లేదని హెచ్చరించారు.

నేడు ఆస్తి పన్ను పరిష్కార వేదిక

కుత్బుల్లాపూర్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆస్తి పన్ను చెల్లింపులో ఉన్న సమ్యలను తెలుసుకునేందుకు జీహెచ్ఎంసీ అధికారులు నెల రోజులుగా ప్రతి శనివారం ఆస్తి పన్ను పరిష్కార వేదికను నిర్వహిస్తుంది. ఇందులో భాగంగా ఈ ఆర్థిక సంవత్సరంలో చివరి శనివారమైన 29వ తేదీన కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని, పన్ను చెల్లింపులో ఎలాంటి సమస్యలున్నా సర్కిల్ కార్యాలయంలో కలిసి దరఖాస్తు చేసుకోవాలని ఉప కమిషనర్లు మల్లారెడ్డి, నర్సింహులు ఓ ప్రకటనలో తెలిపారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.



మహిళను పరీక్షిస్తున్న వైద్యురాలు

క్యాన్సర్‌పై అవగాహన ఉండాలి

పేట్‌బషీరాబాద్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): కొంపల్లి పురపాలక సంఘం పరిధిలోని 12వ వార్డు ఎన్‌సీఎల్ కాలనీలో గ్రాన్యూల్స్, ఇండియా ఏఐజీ ఆస్పత్రి ఆధ్వర్యంలో మొబైల్ ఉమెన్స్ రొమ్ము క్యాన్సర్ స్క్రీనింగ్ యూనిట్‌లో మహిళలకు క్యాన్సర్ పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యురాలు చిరుగుపాటి ప్రజ్ఞ మాట్లాడుతూ క్యాన్సర్‌పై అవగాహన పెంచుకొని ప్రతి సంవత్సరం మహిళలు బెస్ట్ క్యాన్సర్ పరీక్షలు చేయించుకోవాలని, ముందుగా క్యాన్సర్‌ను గుర్తిస్తే నివారించడం రొమ్ము తొలగించే అవసరం ఉండదన్నారు. ఉమామహేశ్వరి కాలనీ, ఎన్‌సీఎల్ కాలనీ మహిళలు పరీక్షలు నిర్వహించుకున్నారు. కార్యక్రమంలో కొత్తూరి మాధూరి, వైద్యులు పాల్గొన్నారు.



కుమార్‌ను సన్మానించిన ఫొటో గ్రాఫర్లు

ఫొటోగ్రాఫర్లు ఎంతో నేర్చుకోవాలి

పేట్‌బషీరాబాద్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): చింతల్, జీడిమెట్ల, సుచిత్రా, కొంపల్లి ఫొటో గ్రాఫర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో నికాన్ ఇండియా ఫిలిమ్ మేకింగ్ సౌజన్యంతో ఫ్యాకల్టీ మెంటర్ వర్క్ షాపును జీడిమెట్ల డివిజన్ అంగడిపేటలో ఓ హోటల్‌లో శుక్రవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన సర్వాన కుమార్ మాట్లాడుతూ అత్యాధునికంగా వస్తున్నటువంటి నికాన్ అప్‌డేట్ కెమెరాలు, లెన్స్‌తో నూతన వరవడిని నేర్చుకునేందుకు ఈ వర్క్‌షాపు ఎంతగానో ఉపయోగ పడుతుందన్నారు. ఫొటో గ్రాఫర్లు ఈ వర్క్‌షాపులో ఎంతో నేర్చుకోవలసి ఉందన్నారు. కార్యక్రమంలో జీడిమెట్ల, చింతల్, సుచిత్రా, కొంపల్లి అసోసియేషన్ అధ్యక్షులు రమేష్, చంద్రశేఖర్, శ్రీకాంత్, స్వామి, శేఖర్‌రెడ్డి, విజయ్ కుమార్, రామకృష్ణారెడ్డి, చంద్రశేఖర్ ఉన్నారు.



సమావేశంలో పాల్గొన్న హన్మంత్‌రెడ్డి, ఇతర నాయకులు

కొనసాగుతున్న 'జై బాపు, జై భీమ్, జై సంవిధాన్'

దుండిగల్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం జై భీమ్, జై బాపూ, జై సంవిధాన్ కార్యక్రమాన్ని కాంగ్రెస్ నాయకులు దుండిగల్ మున్సిపాలిటీ, నిజాంపేట్ కార్పొరేషన్‌లో నిర్వహించారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గే, లోకసభ ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ సూచనల మేరకు మహాత్మాగాంధీ, అంబేడ్కర్ ఆశయాలను ప్రజల్లోకి తీసుకు వెళ్లాలని కాంగ్రెస్ నాయకులు పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొలన్ హన్మంతరెడ్డి, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి, దుండిగల్ మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నవీన్‌రెడ్డి, నియోజకవర్గం కో ఆర్డినేటర్ ఉజ్మాశాకిర్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బొంగునూరి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ సర్పంచ్ కావలి గణేష్, రాము గౌడ్‌లతో పాటు కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.



● అక్రమ నిర్మాణాలను తొలగించాలి

కుత్బుల్లాపూర్, గాజులరామారం జంట సర్కిళ్లలో అనుమతులు లేకుండా ప్రభుత్వ, ప్రైవేట్ భూముల్లో వెలుస్తున్న అక్రమ నిర్మాణాలను తొలగించాలని ఉప కమిషనర్లు నర్సింహ, మల్లారెడ్డిలకు ఫిర్యా దు చేస్తున్న సీపీఐ కుత్బుల్లాపూర్ కార్యదర్శి ఉమామహేష్, హరినాథ్, శ్రీనివాస్ తదితరులు.

-కుత్బుల్లాపూర్, ఆంధ్రజ్యోతి